## కోమటిరెడ్డి కాదు.. కారుకూతల రెడ్డి

- కోమటిరెడ్డీ.. ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడు
- పదవుల కోసం రేవంత్‌రెడ్డి కాళ్ల దగ్గర చేరినవ్
- కేసీఆర్‌ను విమర్శించేటప్పుడు ఆత్మపరిశీలన చేసుకో
- బీఆర్ఎస్ నేతలు ఆంజనేయగౌడ్, గెల్లు శ్రీనివాస్, తుంగ బాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌పై ఇష్టారీతిన మాట్లాడితే సహించేది లేదని, ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. పదవులు, రేవంత్‌రెడ్డి ప్రాపకం పొందేందుకే కేసీఆర్‌పై కోమటిరెడ్డి కారుకూతలు కూస్తున్నారని దుయ్యబట్టారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఈడిగ ఆంజనేయగౌడ్, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ మంత్రులు మూర్ఖుల్లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి ఏం చేస్తారో చెప్పకుండా కేసీఆర్‌ను తిట్టడం పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. సూటుబూటు కోటు వేసుకుని వికృతంగా మాట్లాడితే గౌరవం రాదని, ఆయన కోమటిరెడ్డి కాదు.. కారుకూతల రెడ్డి అని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు వెయ్యి జన్మలెత్తినా కేసీఆర్ త్యాగాలకు సరిరారని చెప్పారు. ఇంతకాలం రాజకీయ బేతాళురుగా ఉన్న కాంగ్రెస్ నేతలకు కాలం కలిసొచ్చి గాలికి మంత్రి పదవులు రావడంతో తట్టుకోలేని ఆనందంలో బూతులు మాట్లాడుతున్నారని అన్నారు. మొన్నటి వరకు రేవంత్‌రెడ్డి అంటేనే ఒంటిపై చీమలు పాకినట్టు ప్రవర్తించిన కోమటిరెడ్డి.. ఇప్పుడు ఆయన భజన చేస్తున్నారని విమర్శించారు. మాణిక్కం ఠాగూర్‌కు రూ.50 కోట్లు ఇచ్చి పీసీసీ అధ్యక్ష పదవి తెచ్చుకున్నాడని రేవంత్‌రెడ్డిని తిట్టిన కోమటిరెడ్డి.. ఇప్పుడు పదవుల కోసం రేవంత్‌రెడ్డి కాళ్ల దగ్గర చేరాడని తూర్పారబట్టారు. పదేండ్ల కేసీఆర్ పాలనపై పోస్టుమార్టం చేసుకుంటూ కూర్చుంటే వచ్చేదేదీ లేదని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్‌పై కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకొని, రాష్ట్ర ప్రజానీకానికి బహిరంగంగా, బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నాయకుడు తుంగ బాలు డిమాండ్ చేశారు. కేసీఆర్ గురించి మాట్లాడే ముందు కోమటిరెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కి, వాటిని అమలు చేయలేక ఇలాంటి అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తూ కాలం గడపాలనుకుంటే ఎన్నికల గండం అనేది ఒకటి ఉంటుందని గుర్తుపెట్టుకోవాలని తుంగ బాలు హితవు పలికారు.

# అప్పల్లో అడుగున.. ఆదాయంలో అగ్రభాగాన!

- ఐదేండ్ల తలసరి ఆదాయ వృద్ధిలో టాప్
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఆసక్తికర విశ్లేషణలు
- అదుపులోనే తెలంగాణ రుణ భారం
- కేసీఆర్ ప్రభుత్వ పనితీరుకు సాక్ష్యం

మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారంటూ విమర్శిస్తున్న వారికి, బీఆర్ఎస్ హయాంలో ప్రజలకు ప్రయోజనాలు అందలేదని ప్రచారం చేస్తున్నవారికి జాతీయ మీడియా కథనాలు చెంపపెట్టులాంటి సమాధానం ఇచ్చాయి. జీఎస్డీపీతో పోల్చితే అప్పుల్లో తెలంగాణ అడుగుభాగాన్నే ఉన్నదని, గత ఐదేండ్లలో తలసరి ఆదాయ వృద్ధిరేటులో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని స్పష్టం చేశాయి. రాష్ట్రాల జీఎస్డీపీతో పోల్చితే అప్పులు ఏ మేర ఉన్నాయో విశ్లేషిస్తూ 'ఫోర్బ్స్ ఇండియా' ఒక కథనాన్ని ప్రచురించింది. 2023-24 బడ్జెట్ అంచనాల ఆధారంగా ఈ విశ్లేషణ చేసింది. ఇందులో తెలంగాణ జీఎస్డీపీ విలువను దాదాపు రూ.14 లక్షల కోట్లుగా పేర్కొన్నది. రాష్ట్ర రుణాలు జీఎస్డీపీతో పోల్చితే 23.8 శాతంగా ఉన్నట్టు తెలిపింది. అంటే అప్పులు అదుపులోనే ఉన్నాయని స్పష్టం చేసింది. జీఎస్డీపీ-రుణాల మధ్య ఉన్న నిష్పత్తి ఆయా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితితోపాటు, ప్రభుత్వ విధానాలను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నది. 27 రాష్ట్రాల జాబితాలో తెలంగాణ అతి తక్కువ అప్పులతో కింది నుంచి ఐదో స్థానంలో నిలిచింది. ఈ కథనాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'అతితక్కువ రుణ భారం ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఐదో స్థానంలో నిలిచినట్టు ఫోర్బ్స్ ఇండియా స్పష్టం చేసింది. దీన్నిబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన శ్వేతపత్రం పదేండ్ల కేసీఆర్ పాలనను బదనాం చేయడానికి చేసిన ప్రయత్నమే అని స్పష్టం అవుతున్నది. తెలంగాణ అప్పుల కుప్పగా మారిందంటూ బీజేపీ, సోషల్ మీడియా, కొన్ని యూట్యూబ్ చానళ్లు చేస్తున్న ప్రచారం మొత్తం అబద్ధమని ఫోర్బ్స్ కథనంతో తేటతెల్లం అయ్యింది. సత్యమేవ జయతే' అని పోస్ట్ చేశారు.

### టాప్‌గేర్‌లో తలసరి ఎన్ఎస్‌డీపీ

ఐదేండ్లలో తలసరి ఎన్ఎస్‌డీపీ (నెట్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్) వృద్ధిలో తెలంగాణ అగ్రభాగాన నిలిచిందంటూ ఇటీవల ఆర్బీఐ హ్యాండ్‌బుక్‌లో పేర్కొన్నది. స్థిర ధరల వద్ద 2017-18 నుంచి 2022-23 వరకు ఆయా రాష్ట్రాల తలసరి ఎన్ఎస్‌డీపీ వృద్ధి ఆధారంగా ఆర్బీఐ జాబితా రూపొందించింది. ఇందులో తెలంగాణ 28.52 శాతం వృద్ధిని కనబరిచింది. ఇది కేసీఆర్ ప్రభుత్వ పాలనకు మరో గీటురాయి అని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. 'తెలంగాణ గత పదేండ్లలో సాధించిన ప్రగతిని అంకెలే వివరిస్తాయి. థ్యాంక్స్ టు కేసీఆర్' అని పోస్ట్ చేశారు. తమిళనాడు 25.33 శాతం, కర్ణాటక 25.32 శాతం, ఒడిశా 22.99 శాతం, ఛత్తీస్‌గఢ్ 22.14 శాతంతో టాప్-5 రాష్ట్రాల్లో నిలిచాయి.

# అర్రాస్ పాటలా గ్యారెంటీలు

- కాంగ్రెస్ హామీలను దేవుడు కూడా తీర్చలేడు
- ఆ పార్టీకి అధికారం లక్కీ దువ్వలో లాటరీ
- పాలమూరును ఆగం చేసిందే హస్తం పార్టీ
- కరెంట్ బంద్, రైతుబంధు బంద్, నీళ్లు బంద్
- ప్రభుత్వ వైఫల్యంతో యాసంగి సాగు ఢమాల్
- రేవంత్ భాష, వ్యవహారశైలి సీఎంలా లేదు
- ఉద్యమంలో ఆయన పాత్ర గుండు సున్నా
- కేసీఆర్‌ను తిట్టడానికే సీఎం పీఠమెక్కారా?
- మల్కాజిగిరికి ఎందుకు పోయినవ్ రేవంత్?
- కొడంగల్‌కు కాలేజీలన్నీ కేసీఆర్ ఇచ్చినవే
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వెల్లడి

గురువారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో బీఆర్ఎస్ నాయకులు అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, క్యామ మల్లేశ్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): ఒకటో గ్యారెంటీ, రెండో గ్యారెంటీ అంటూ హామీలను అర్రాస్ పాటలా ప్రకటిస్తున్నారని కాంగ్రెస్ సర్కారుకు మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చురక అంటించారు. భగవంతుడు కూడా ఆ పార్టీ హామీలను అమలు చేయలేడని అన్నారు. రైతుబంధు వేసేందుకు ఎందుకు ఆలోచిస్తున్నారని, ఎండిన పంటలు, సాగు వెనక్కి వస్తాయా? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుబంధును ఆపేసి వ్యవసాయాన్ని ఆగం చేసిందని ఆరోపించారు. కరెంటు, నీళ్లు, రైతుబంధు, రైతుబీమా ఇచ్చి రైతులకు కేసీఆర్ అండగా నిలిస్తే.. రేవంత్ అధికారంలోకి రాగానే అన్నీ కట్క బంద్ చేసినట్టుగా ఆగిపోయాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక కరెంటు బంద్, రైతుబంధు బంద్, నీళ్లు బంద్ అయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో యాసంగి పంట కనీసం పావు వంతు కూడా సాగు కాలేదని, గత సంవత్సరం లెక్కలు, ఈ సంవత్సరం లెక్కలు బయటపెడితే వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. కాంగ్రెస్‌కు అధికారం లక్కీ దువ్వలో లాటరీ లాంటిదని, కేసీఆర్‌ను తిట్టడానికి రేవం త్ ముఖ్యమంత్రి కాలేదనే విషయాన్ని ఆయన గుర్తించాలని హితవు చెప్పారు. కొడంగల్ సభ లో రేవంత్ భాష, వ్యవహారశైలి ముఖ్యమంత్రి హోదాకు తగ్గట్టు లేదని ఆక్షేపించారు. ముఖ్యమంత్రి అయ్యాక కూడా ఎందుకో రేవంత్ తన తీరును సమీక్షించుకోవడం లేదని అన్నారు. రేవంత్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని సూచించారు.

### పాలమూరు కష్టాలకు కాంగ్రెస్సే కారణం

174 టీఎంసీలు గ్రావిటీ ద్వారా పాలమూరుకు రావాల్సిన నీటిని పోగొట్టిన పాపం కాంగ్రెస్ పార్టీదేనని, హైదరాబాద్ రాష్ట్రాన్ని విలీనం చేయటంతో నష్టం జరిగిందని నిరంజన్‌రెడ్డి అన్నారు. దశాబ్దాల పాటు జూరాల, నెట్టెంపాడు, భీమా పథకాల నిర్మాణాలను కాంగ్రెస్ సాగదీసింది అని విమర్శించారు. 35-40 ఏండ్ల పాటు పాలమూరు ప్రాజెక్టును సాగదీసిన కాంగ్రెస్.. రాయలసీమ ప్రాజెక్టులు పూర్తి చేసి పాలమూరు ప్రాజెక్టులు ఎండబెట్టిందని ఆరోపించారు. 3.94 లక్షల ఎకరాల కల్వకుర్తి ఎత్తిపోతల ఆయకట్టులో కేవలం 3.9 టీఎంసీల రిజర్వాయర్లను నిర్మించారని, 17 రిజర్వాయర్లను టెండర్లకు ముందే కాంగ్రెస్ ఎత్తివేసిందని తెలిపారు. సగం సగం పనులు గాలికి వదిలేసిందని గుర్తుచేశారు. గతంలో కల్వకుర్తి ఎత్తిపోతల పంపులన్నీ నీట మునిగాయని వెల్లడించారు. కాంగ్రెస్‌లా తాము ఏనాడూ రాజకీయం చేయలేదని, కేసీఆర్ హయాంలోనే పాలాలకు సాగునీరు అందిందని వివరించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలపై కేసుల వేసినా, అన్నీ తట్టుకుని నీళ్లిచ్చే దశకు తీసుకువచ్చామని తెలిపారు. పాలమూరు జిల్లాలో రైతాంగానికి నీళ్లు ఎవరిచ్చారో రైతులను అడిగితే చెప్తారని అన్నారు.

### రేవంత్.. నువ్వు ఎక్కడి నుంచి వచ్చావు?

కేసీఆర్ ఎక్కడి నుండి వచ్చారని చవకబారు మాటలు మాట్లాడటం భావ్యం కాదని సీఎం రేవంత్‌రెడ్డికి నిరంజన్‌రెడ్డి హితవు చెప్పారు. 'రేవంత్ కొడంగల్‌కు ఎందుకు వెళ్లాడు? అక్కడి నుంచి మల్కాజిగిరికి ఎందుకు వెళ్లాడు? రాహుల్ వాయనాడ్‌కు, సోనియాగాంధీ రాజస్థాన్‌కు ఎందుకు వెళ్లారు?' అని ప్రశ్నించారు. ఉద్యమంలో రేవంత్ పాత్ర గుండు సున్నా అని అన్నారు. కొడంగల్‌లో ఓడిపోయాక మల్కాజిగిరిలో ఎంపీగా గెలిచాక పార్లమెంట్‌లో తెలంగాణ సమస్యపై ఎన్ని సార్లు ప్రస్తావించారని, ఎన్నిసార్లు తెలంగాణ నీళ్ల గురించి, నిధుల గురించి మాట్లాడారని సీఎంను నిలదీశారు. కొడంగల్‌లో రాజకీయ పునాదులను పటిష్టం చేసుకునేందుకే రేవంత్ నిధులు మంజూరు చేస్తున్నారని, అక్కడ శంకుస్థాపన చేసిన కాలేజీలన్నింటికీ అనుమతులు తెచ్చింది కేసీఆరే అని గుర్తుచేశారు. సమావేశంలో అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, క్యామ మల్లేశ్ పాల్గొన్నారు.

# పొద్దుతిరుగుడు కొనుగోళ్లు ప్రారంభం

- కేంద్రాల ఏర్పాటుకు మాజీ మంత్రి హరీశ్ విజ్ఞప్తి
- మద్దతు ధర లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని వెల్లడి
- స్పందించిన మంత్రి తుమ్మల.. కొనుగోలుకు ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): పొద్దుతిరుగుడు పంట కొనుగోళ్లు ప్రారంభించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన విజ్ఞప్తికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పందించారు. కొనుగోలుకు వెంటనే చర్యలు చేపట్టాలని మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ట్విట్టర్ ద్వారా.. పొద్దుతిరుగుడు పంట చేతికొచ్చిందని, రైతులకు మద్దతు ధర దక్కడం లేదని తెలిపారు. మద్దతు ధర క్వింటాలుకు రూ.6,760 ఉండగా, మార్కెట్లో రూ.4-5వేలకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉన్నదని, తద్వారా రైతులు నష్టపోతున్నారని తుమ్మల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి.. వెంటనే మార్క్‌ఫెడ్ ఎండీ సత్యనారాయణరెడ్డితో మాట్లాడి పొద్దుతిరుగుడు పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఎండీ చర్యలు చేపట్టారు. ప్రస్తుతం రంగారెడ్డి, ఉమ్మడి మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో 9 కేంద్రాల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం నుంచి ఈ కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభించనున్నట్టు ఎండీ సత్యనారాయణరెడ్డి తెలిపారు. పొద్దుతిరుగుడు పంటను తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోవద్దని రైతులకు మంత్రి సూచించారు. ఈ యాసంగిలో 21,350 ఎకరాల్లో పొద్దుతిరుగుడు పంట సాగు కాగా 16,995 టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు.

## ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చా

- బీజేపీ నేత మహేశ్వర్‌రెడ్డివి దిగజారుడు వ్యాఖ్యలు
- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి విమర్శ

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): తనకు రాజకీయంగా జన్మనిచ్చిన చేవెళ్ల ప్రాంత ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని, పైసలు, పనుల కోసం కాదని చేవెళ్ల ఎంపీ డాక్టర్ జీ రంజిత్‌రెడ్డి స్పష్టం చేశారు. బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని, ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మహేశ్వర్‌రెడ్డి తనపై చేసిన ఆరోపణలు ని రూపిస్తే తాను దేనికైనా సిద్ధమని రంజిత్‌రెడ్డి సవాల్ విసిరారు. చేవెళ్లకు వచ్చిన మహేశ్వర్‌రెడ్డి ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ను చదివి ప్రెస్‌మీట్‌లో మాట్లాడటం నిజంగా దారుణమని విమర్శించారు. ఏదైనా అంశంపై మాట్లాడే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. నీతారాంపూర్ భూముల వ్యవహారంలో తన పాత్ర ఏమీ లేదని, ఆ వ్యవహారమంతా తాను ఎంపీ కాకముందే జరిగిందని, ఈ విషయం మహేశ్వర్‌రెడ్డి తెలుసుకోవాలని హితవు చెప్పారు.



జగిత్యాల జిల్లా పోరుమల్లలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

## కాంగ్రెస్‌వన్నీ ఆచరణ సాధ్యంకాని హామీలే

- అమలుకు వెంటనే జీవోలు ఇవ్వాలి
- ఎన్నికల కోడ్‌తో తప్పించుకోవద్దు
- మీడియాతో కరీంనగర్ మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్

మేడిపల్లి, ఫిబ్రవరి 22: కాంగ్రెస్ ఆచరణకు సాధ్యం కానీ హామీలిచ్చి ఓట్లు దండుకున్నదని కరీంనగర్ మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్ విమర్శించారు. గురువారం ఆయన జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం పోరుమల్లలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలకు వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం జీవో విడుదల చేయాలన్నారు. వారం పది రోజుల్లో పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నదని, దానిని సాకుగా చూపి తప్పించుకునే ప్రయత్నం చేయవద్దని సూచించారు. ఆరు గ్యారెంటీల్లో ఇప్పటివరకు ఒక్క గ్యారెంటీ కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. రెండ్రోజుల్లో 200 యూనిట్ల కరెంట్, రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీలు అమలు చేస్తామని ప్రకటించినందున వెంటనే జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఏప్రిల్, మే మాసాల్లో క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వాలని సూచించారు. కల్యాణలక్ష్మి ద్వారా రూ.లక్షతోపాటు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4వేల పెన్షన్ ఇవ్వాలని సూచించారు.

# పాలమూరు ప్రాజెక్టును పరిశీలిద్దాం రండి

- కొడంగల్‌కు జూరాల ఎత్తిపోతలపై పునరాలోచించాలి
- అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బీజేపీ సహకారం
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్

గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో బీఆర్ఎస్ నాయకులు దేవీప్రసాద్, అంజనేయగౌడ్, తుంగ బాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరంపై పదేపదే మాట్లాడే సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కూడా పరిశీలించాలని, తాము కూడా మీతో కలిసి వస్తామని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. ఈ ప్రాజెక్టులో 10 శాతం పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, నాలుగైదు నెలల్లో పూర్తి చేయవచ్చని తెలిపారు. ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించి పాలమూరు నీళ్లిచ్చిన ఘనత తమదే అని చెప్పుకోండంటూ సూచించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొడంగల్‌కు జూరాల ఎత్తిపోతల నుంచి నీటి తరలింపుపై పునరాలోచన చేయాలని పేర్కొన్నారు. కర్ణాటక కొత్త ఎత్తిపోతల పథకాలను ప్రారంభిస్తే జూరాలకు నీరందే పరిస్థితి ఉండదని తెలిపారు. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి వాస్తవాలు మాట్లాడితే బాగుంటుందని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ముసళ్ల పండగ ముందే ఉన్నదని చెప్పారు. పాలమూరు ఉమ్మడి ఏపీ పాలనలో బాగుందా, రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అభివృద్ధి జరిగిందా చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్, టీడీపీ హయాంలో అభివృద్ధి జరుగలేదని, కేసీఆర్ పాలమూరు ఎంపీగా ఉండబట్టే తెలంగాణ ఏర్పడిందని తెలిపారు. కల్వకుర్తి ద్వారా 6.50 లక్షల ఎకరాలకు తమ ప్రభుత్వంలోనే నీరు అందించామని తెలిపారు. సీఎం అయినందుకు రేవంత్‌రెడ్డి పాలమూరు జిల్లాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. కేసీఆర్ ఒక్క ఓటమిపై ఇన్ని అభాండాలా అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేశాయని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి పొత్తు అవసరం లేదని, బీజేపీ నేతలకే అలాంటి ఆలోచన ఏమైనా ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు దేవీప్రసాద్, అంజనేయగౌడ్, తుంగ బాలు పాల్గొన్నారు.

## తమిళనాడులో ఎస్సీ, ఎస్టీ యాక్షన్‌ప్లాన్ బిల్లుపై హర్షం

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ చైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమిళనాడు రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం తమిళనాడు డెవలప్‌మెంట్ యాక్షన్ ప్లాన్ ఫర్ ఎస్సీ, ఎస్టీ బిల్లు-2024ను ఆ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిందని గుర్తుచేశారు. బిల్లు కోసం కృషి చేసిన తమిళనాడు వీసీకే పార్టీకి, దళిత సంఘాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## విద్యుత్తు సబ్సిడీ 1956.67 కోట్లు విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వివిధ పథకాల రూపంలో అందిస్తున్న విద్యుత్తు చార్జీల బకాయిల మొత్తం రూ.1956,67,33,000 టీఎస్ ట్రాన్స్‌కోకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. వ్యవసాయ ఉచిత విద్యుత్తు, నీటిపారుదల ప్రాజెక్టుల చార్జీలు, హైదరాబాద్ మెట్రో వాటర్ సర్వీస్ అండ్ సీవరేజీ బోర్డు చెల్లించాల్సిన విద్యుత్తు చార్జీలు, మిషన్ భగీరథ పథకం విద్యుత్తు చార్జీల రాయితీ మొత్తాన్ని చెల్లించింది. ఈ మొత్తంలో ఫిబ్రవరి నెలకు సంబంధించి రాయితీతోపాటు 2023 నవంబర్, 2024 జనవరిలో మంజూరు చేయాల్సిన రాయితీ బకాయిలు కూడా ఉన్నట్టు గురువారం జారీచేసిన శాంక్షన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందులో 2023 నవంబర్‌కు సంబంధించి రూ.617.67 కోట్లు, 2024 జనవరికి సంబంధించి రూ.380.67 కోట్లు, ఫిబ్రవరి మాసానికి సంబంధించి రూ.958.33 కోట్లు ఉన్నట్టు ఆ ఉత్తర్వుల్లో తెలిపారు.

SBI
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సెంట్రల్ రిక్రూట్‌మెంట్ & ప్రమోషన్ డిపార్ట్‌మెంట్
కార్పొరేట్ సెంటర్, ముంబై
ఫోన్: 022-22820427

కాంట్రాక్టు/రెగ్యులర్ ప్రాతిపదికన స్పెషలిస్టు అధికారుల నియామకం

భారతీయ స్టేట్ బ్యాంకు క్రింద పేర్కొనిన స్పెషలిస్టు ఉద్యోగ కొరకు భారత పౌరుల నుండి దరఖాస్తులు కోరుచున్నది:

| క్ర. సం | పోస్ట్ | ఖాళీ | ప్రకటన నం. |
|---|---|---|---|
| 1 | సర్కిల్ డిఫెన్స్ బ్యాంకింగ్ అడ్వైజర్ (CDBA) కాంట్రాక్చువల్ ఈక్వి. TEGS-VI (ఉప మహా నిర్వాహణాధికారి) | 01 | CRPD/SCO/ 2023-24/31 |
| 2 | సహాయక నిర్వహణాధికారి (సెక్యూరిటీ అనలిస్ట్) రెగ్యులర్ JMGS-I | 23 | CRPD/SCO/ 2023-24/32 |
| 3 | ఉప నిర్వాహణాధికారి (సెక్యూరిటీ అనలిస్ట్) రెగ్యులర్ MMGS-II | 51 | |
| 4 | నిర్వాహణాధికారి (సెక్యూరిటీ అనలిస్ట్) రెగ్యులర్ MMGS-III | 03 | |
| 5 | సహాయక మహా నిర్వాహణాధికారి (అప్లికేషన్ సెక్యూరిటీ) రెగ్యులర్ SMGS-V | 03 | |
| 6 | క్రెడిట్ అనలిస్ట్ రెగ్యులర్ MMGS-III | 50 | CRPD/SCO/ 2023-24/33 |

అర్హత ప్రమాణాలు (వయసు, అనుభవం, ఉద్యోగ ప్రొఫైల్ మొదలైనవి), చెల్లించవలసిన ఫీజు మరియు ఇతర వివరాల కోసం బ్యాంక్ వెబ్‌సైట్ https://bank.sbi/web/careers లో లాగ్‌ఆన్ అయ్యి, ఆన్‌లైన్‌లో దరఖాస్తును నింపి ఆన్‌లైన్ ఫీజు లింక్ ద్వారా దరఖాస్తు ఫీజును చెల్లించండి. దరఖాస్తు మరియు ఫీజు చెల్లింపు వివరాలతో పాటు అర్హతలని నిర్ధారించు కొనుటకు మరియు పూర్తి వివరాల కొరకు ప్రకటనను చూడండి.

- ఆన్ లైన్ లో దరఖాస్తు చేయుటకు మరియు ఫీజు చెల్లింపు తేదీ : 13.02.2024 నుండి 04.03.2024 వరకు

ఏవైనా సందేహాలు ఉన్నా, దయచేసి మాకు - "CONTACT US" —> "Post Your Query" లింకు ద్వారా వ్రాసి పంపండి. ఈ లింకు మీకు బ్యాంకు వెబ్ సైట్ లో లభించును.

స్థలం: ముంబై
తేదీ: 13.02.2024
మహానిర్వహణాధికారి (ఆర్పీ & పీఎం)

# శిలాక్షరం కేసీఆర్

- చెరిపేస్తే చెరగని సంతకం
- తెలంగాణ పదం ఉన్నంతకాలం కేసీఆర్ చరిత్రను చెరపలేరు
- అధికారిక చానళ్లలోని వీడియోల తొలగింపుపై తెలంగాణప్రజల ఫైర్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రి హోదాలో పాల్గొన్న కార్యక్రమాల వీడియోలు, తెలంగాణ సీఎంవో, రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ యూట్యూబ్ చానల్స్‌లో ప్రత్యక్ష ప్రచారం చేసిన వీడియోలను తొలగించడం వివాదస్పదమవుతున్నది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు సంబంధించిన ఆయా వీడియోలను తొలగిండంపై తీవ్ర విమర్శలొస్తున్నాయి. 'తెలంగాణ శిలాక్షరం కేసీఆర్. తెలంగాణ పదం ఉన్నంతకాలం ఆ పేరు చిరస్థాయిగా ఉంటుంది. అది చెరగని సంతకం. అధికారిక యూట్యూబ్ చానల్, తెలంగాణ సీఎంవో, సమాచార పౌరసంబంధాల శాఖ ప్రసారం చేసే చానల్స్‌లో కేసీఆర్ వీడియోలను తొలగించినంత మాత్రాన ప్రజల హృదయాల నుంచి ఆయన ముద్రను ఎవరూ తొలగించలేరు'. ఇది తెలంగాణవాదులు ఘంటాపథంగా చెప్తున్న మాట. 'పార్టీలు, ప్రభుత్వాలు, నాయకులు, అధికారులు, సలహాదారులు మారినంత మాత్రాన చరిత్ర చెరిగిపోదు. 'పచ్చబొట్టు చెరిగిపోదులే' అన్నట్టు కేసీఆర్‌ను తెలంగాణ సమాజమే కాదు యావత్‌దేశం మరిచిపోదు' అని వ్యాఖ్యానిస్తున్నారు. అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు తాము నడిచివచ్చిన దారిని విస్మరించి, ఆ దారి వేసినవారిని నిత్యం తూలనాడటం ద్వారా